కిషన్‌రెడ్డికి ఆహ్వానం


కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ దాయిబాగ్‌లోని హనుమాన్ బాలాజీ మందిరంలో నిర్వహించే లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆలయ కమిటీ ఆహ్వాన పత్రిక అందజేసింది. ఆగస్టు 3 నుంచి 7వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రమేష్, దాస శ్రీనివాస్, గురు, భారతీయ జనతాపార్టీ సెంట్రల్ జిల్లా నాయకులు అన్నపురం రమేష్‌కుమార్, వి.భుజేందర్ తదితరులు మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం


పూజలు చేస్తున్న ఆలయ ప్రతినిధి శేషాచారి, ప్రధాన అర్చకులు శ్రీనివాస రంగనాథాచార్యులు

జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రతినిధి శేషాచారి ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఈ వేడుకలు 31వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రతిరోజూ హోమం, పూర్ణాహుతి, శాతుమురై అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపించాలి


పతకాలు అందజేసిన మహిపాల్, శ్రీబాలాజీ

జియాగూడ: యువత క్రీడలపై ఆసక్తి చూపించాలని తెలంగాణ రాష్ట్ర కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహిపాల్, ఉపాధ్యక్షులు ముల్తాంకార్ శ్రీబాలాజీ అన్నారు. ఇటీవల ఎల్బీ స్టేడియంలో జరిగిన అస్మిత ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జియాగూడకుచెందిన ఎ.వైష్ణవి, హారతిపోల్, బంగారు పతకాలు లభించగా, ఎం. సంజనాకు వెండి పతకం లభించింది. ఈ సందర్భంగా వారి మంగళవారం మహిపాల్, శ్రీబాలాజీ ఘనంగా సన్మానించారు.

రోడ్లకు ప్యాచ్‌వర్క్


పనులు పరిశీలిస్తున్న సయ్యద్ అహ్మద్ రజ్వి తదితరులు

విజయనగర్‌కాలనీ: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆసిఫ్‌నగర్, మురాద్‌నగర్, జేబాబాగ్, తదితర ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయమయ్యాయి. ప్రజల ఫిర్యాదు మేరకు మంగళవారం ఆసిఫ్‌నగర్ డివిజన్ సయ్యద్ అలీగూడ, మురాద్ నగర్ రాయల్‌సీ హోటల్, లేబర్ అడ్డ, ముంతాజ్ మజీద్ రోడ్డు, పీర్‌పాషా కమాన్ తదితర ప్రాంతాల్లో బీటీ ప్యాచ్‌వర్క్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అలీగూడ ఏరియా ప్రెసిడెంట్ సయ్యద అహ్మద్ రజ్వి మాజీద్, మహ్మద్ మూసా తదితరులు పాల్గొన్నారు.


అహ్మద్‌నగర్ నాలా పక్కనే పూడికతీత మట్టి


అహ్మద్‌నగర్ పార్కు పక్కన చెత్త డంపింగ్

సమస్యలతో సతమతం

- అహ్మద్‌నగర్‌లో నాలా పక్కన పేరుకుపోతున్న వ్యర్థాలు
- పార్కు ప్రహరీ చుట్టూ చెత్త డంపింగ్
- గుంతలమయంగా రోడ్లు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

గోల్కొండ: అహ్మద్‌నగర్ డివిజన్ సమస్యలతో సతమతమవుతోంది. బల్దియా అధికారులు ఈ డివిజన్‌పై కన్నెత్తి చూడడం లేదు. ఎటు చూసినా వ్యర్థాలు, చెత్త కుప్పలు గుట్టలుగా పడి ఉంటున్నాయి. మరోవైపు ప్రధాన రహదారుల పక్కన ఉన్న వ్యర్థాలు కుళ్లి దుర్గంధం వ్యాపిస్తోంది. అహ్మద్‌నగర్‌లోని విశాలమైన పార్కు చుట్టూ వ్యర్థాలు కుప్పలుగా పడి ఉంటున్నాయి. దీంతో పార్కు వచ్చే వారు కాకుండా పక్క నుంచి వెళ్లే వారు ముక్కులు మూసుకోని వెళ్తున్నారు.

శిథిలమైన పాత మిలట్రీ క్వార్టర్స్..

బంజారా కేఫ్ పాయింట్ వద్ద రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారయ్యింది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. మాసాబ్ ట్యాంక్ క్రీసెంట్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి అహ్మద్‌నగర్ బడాబజార్ వచ్చే రూట్ పక్కన కూడా చెత్త కుప్పలు గుట్టలుగా పడి ఉంటున్నాయి. ఈ రోడ్డుకు పక్కన ఉన్న శిథిలమైన పాత మిలట్రీ క్వార్టర్స్ ఉన్నాయి. ఈ క్వార్టర్స్‌లో సైతం వ్యర్థాలు ప్రతినిత్యం డంపింగ్ అవుతున్నాయి. ఈ కారణంగా ఇక్కడ నివసించే వారు విజృంభిస్తున్న దోమలతో నిద్రకు దూరం అవుతున్నారు.

అధ్వానంగా నాలా నిర్వహణ..

అహ్మద్‌నగర్ నాలా నిర్వహణ పూర్తిగా అధ్వానంగా తయారయ్యింది. నాలాలో యథేచ్ఛగా స్థానికులు చెత్త వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. దీంతో నాలాలో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల కారణంగా మురికి నీరు ముందుకు కదలడం లేదు. నాలా దోమల ఉత్పత్తి కేంద్రంగా మారడంతో పాటు దుర్గంధాన్ని వ్యాపింపజేస్తూ స్థానికులకు రోగులకు కారణం అవుతున్నాయి.

వ్యర్థాలను తెచ్చి పోస్తున్నారు..

అహ్మద్‌నగర్ ముస్లిం శ్మశానవాటికకు ఆనుకొని ఉన్న అహ్మద్‌నగర్ నాలాలో కొంత కాలం క్రితం పూడికలు తీశారు. అయితే ఈ పూడికలను నాలాకు ఒక పక్కన డంపింగ్ చేశారు. ఇక్కడ నుంచి వాహనాలతో వెళ్తున్న వారు ముక్కుమూసుకోని వెళ్తున్నారు. మరికొందరు ఈ పూడికతీత కుప్పలపై వ్యర్థాలను తెచ్చి పోస్తున్నారు. టన్నుల కొద్ది పడి ఉన్న ఈ పూడికతీత వ్యర్థాలను ఎప్పుడు తరలిస్తారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. నాంపల్లి నియోజకవర్గంలోని అహ్మద్‌నగర్ డివిజన్‌పై అధికారులు ఎప్పుడు కూడా కన్నెత్తి చూడరని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ముగిసిన సామూహిక కుంకుమార్చన


అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

యాకుత్‌పురా: బోనాల ఉత్సవాల సందర్భంగా హరిబౌలీ గజానన వ్యాయామశాల మాత్తేశ్వరీ పోచమ్మ, మహంకాళి ఆలయంలో 5 మంగళవారాపాటు నిర్వహించి అమ్మవారి సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఉదయం 11 గంటలకు నిర్వహించిన సాముహిక కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి అర్చన చేశారు. పాతబస్తీ ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, మాజీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, పోటేల్ సదానంద్‌యాదవ్, మధుసూదన్ యాదవ్, సభ్యులు శ్రీధర్, హన్సరాజ్‌ను ఘనంగా సన్మానించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఆలయ కమిటీ ప్రధాన ప్రతినిధి కెడాల దినేష్, సభ్యులు ప్రభునాథ్, సుశీల్, శ్రావణ్, గోపాల్‌యాదవ్, అజయ్, శ్రీధర్, రవీందర్, ప్రభునాథ్, ప్రకాష్, విఠల్ రావు, సాయితేజ, శ్రీనివాస్, అభినవ్, వేద్‌సాయి, మన్మోహన్, అర్చకులు రంగానాథ్ పాల్గొన్నారు.


వేడుకల్లో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ తదితరులు

శంకరన్‌కు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం

చార్మినార్/బహదూర్‌పురా: వన్య ప్రాణుల సంరక్షణే ధ్యేయంగా 55 ఏళ్ల పాటు విశిష్ట సేవలు అందించిన నెహ్రూ జూలాజికల్ పార్క్ విశ్రాంత క్యూరేటర్ శంకరన్‌కు జీవిత సాఫల్య పురస్కారం, (లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు) లభించింది. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎలుసింగ్ మేరు, ఐఎఫ్ఎస్‌లతో కలిసి శంకరన్‌కు అవార్డు ప్రదానం చేశారు. తెలంగాణ చరిత్రలో తొలిసారిగా, కవాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ల నుంచి ఫ్రంట్‌లైన్ అటవీ సిబ్బందిని వన్యప్రాణుల రక్షణకు కృషి చేసిన జూ పార్కులో నలుగురికి, కవాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ల సిబ్బంది 20 మందికితో పాటు 60 మంది విద్యార్థులకు అచీవ్‌మెంట్ అవార్డులను అందజేశారు.

వైద్యరత్న అవార్డుల ప్రదానం



నాంపల్లి: బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో మంగళవారం నందమూరి తారక రామారావు కళా మందిరంలో వైద్య రంగంలో విశేషమైన సేవలందిస్తున్న వైద్యులకు వైద్యరత్న అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులుగా ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, రజక సంఘం నాయకులు శ్వేతా ఐలమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులకు వైద్య రత్న అవార్డులను అందజేసి సత్కరించారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు దుర్గారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్, రాష్ట్ర కోశాధికారి పసుపులేటి కరుణాకర్, అవార్డ్స్ కమిటీ కన్వీనర్ శ్రీధర్, రాష్ట్ర కార్యదర్శి చేర్యాల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బేగంబజార్‌లో ప్రీ మాన్సూన్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్


కార్యక్రమంలో డీసీ ఉమా ప్రకాష్, ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణ

అబిడ్స్: జీహెచ్ఎంసీ అబిడ్స్–14వ సర్కిల్ పరిధిలోని బేగంబజార్‌లో ప్రీ మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ ఆదేశాల మేరకు మంగళవారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్, ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణ ఈ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ పరిశుభ్రత, పచ్చదనం పాటించాలని సూచించారు. వ్యాపారస్తులు, స్థానిక గృహాల్లో చెత్తాచెదారాన్ని డస్ట్‌బిన్లలో వేయాలని రోడ్లపై వేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఎంటమాలజిస్ట్ సిబ్బంది, అధికారులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించం


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్

నాంపల్లి: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నాంపల్లి రైల్వే స్టేషన్‌లో అవగాహన సదస్సు, ర్యాలీని చేపట్టారు. బచ్‌పన్ బచావో ఆందోళన్, ఆశ్రిత ఆర్గనైజేషన్స్ సంస్థల సంయుక్త నిర్వహణలో జరిగింది. ఈ కార్యక్రమానికి జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో మానవ అక్రమ రవాణా, ముఖ్యంగా చిన్న పిల్లల అక్రమ రవాణా ఎక్కువ జరుగుతున్నట్లు చెప్పారు.

అలాంటి అక్రమాలకు ఎవరైనా పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బచ్‌పన్ బచావో ఆందోళన్ సభ్యులు నరేష్, ఆశ్రిత ఆర్గనైజేషన్ సభ్యులు పర్వతాలు, మాధవి, సెంట్రల్ రైల్వే పోలీస్ ఫోర్స్ అధికారులు కల్పన, ఎస్ఐ రంగారావు, ఏఎస్ఐ భిక్షపతి పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురికి మూడేళ్ల జైలు

గౌలిపురా: వ్యక్తి హత్య కేసులో నలుగురు నిందితులకు నాంపల్లి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. భవానీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..మురాద్ మహల్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ రెహమాన్ బిన్ అమీర్ ఇంట్లో షబ్నం పఠాన్ అలియాస్ షకీలా (44) నివాసం ఉండేది. కాగా షబ్నం పఠాన్ తన అవసరాల నిమిత్తం 2011లో రూ.50 వేలను తీసుకుంది. ఆరు నెలల అనంతరం రెహమాన్ బిన్ అమీర్ వడ్డీతో కలిసి మొత్తం రూ.80 వేలను చెల్లించాలని సూచించాడు. కాగా షబ్నం డబ్బులు చెల్లించకుండా అద్దె చెల్లిస్తూ వచ్చింది. కాగా తనకు డబ్బులు మొత్తం ఇవ్వాలని రెహమాన్ బిన్ అమీర్ షబ్నం పఠాన్‌పై ఒత్తిడి తెచ్చాడు. దీంతో అమీర్‌ను ఎలాగైనా చంపాలని షబ్నం నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా తన ప్లాన్‌ను సంతోష్‌నగర్‌కు చెందిన ప్రియుడు షేక్ జబ్బార్‌కు తెలిపింది. దీంతో షేక్ జబ్బార్ తన స్నేహితులైన అంజద్ ఖాన్ (30), వలీ మహ్మద్ అలియాస్ సికిందర్ (22) హత్య వివరాలను వివరించారు. ఇందులో భాగంగా 2016 ఏప్రిల్ 11న నలుగురు కలిసి అమీర్‌ను హత్య చేశారు. ఈ కేసులోని నిందితులకు మంగళవారం 7వ అడిషనల్ సెషన్స్ జడ్జి సీవీఎస్ భూపతి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ముఖేష్ గౌడ్ అడుగుజాడల్లో యువత పయనించాలి

అబిడ్స్: ఉమ్మడి రాష్ట్రాల మాజీ దివంగత మంత్రి ముఖేష్ గౌడ్ అడుగుజాడల్లో యువత పయనించాలని ఆయన కుమారుడు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం.విక్రమ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ముఖేష్ గౌడ్ వర్ధంతిని గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ..ముఖేష్ గౌడ్ గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గానికి దాదాపు 40 ఏళ్లు ఎనలేని సేవలు చేశారన్నారు. నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ముఖేష్‌గౌడ్ అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. తన తండ్రి ముఖేష్ గౌడ్‌ని ఆదర్శంగా తీసుకొని తాను నిరంతరం ప్రజాసేవకే అంకితమయ్యానని పేర్కొన్నారు.

కారు ఢీకొని కానిస్టేబుల్‌కు గాయాలు

నాంపల్లి: గుర్తు తెలియని కారు ఢీకొని ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలైన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లేపల్లి ఎక్స్ రోడ్‌లో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..సౌత్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసే మనోజ్(30) కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం మల్లేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద బైక్‌పై వెళ్తుండగా ఓ గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో కానిస్టేబుల్ మనోజ్‌కు గాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి


వీ.జీ.పురుషోత్తం (ఫైల్)

అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీజీ పురుషోత్తమ్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. 30 ఏళ్లకు పైగా బేగంబజార్, గోషామహల్ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ నిరంతరం సేవా కార్యక్రమలు చేపట్టే వారు. ఆయన మృతి చెందడంతో బేగంబజార్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బజరంగ్ గోప్, వివిధ పార్టీల నాయకులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన అంత్యక్రియల్లో అరుందతి సేవా మండలి నాయకులు కృష్ణ, ధర్మేందర్, కార్పొరేటర్ శంకర్ యాదవ్, ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

నాంపల్లి: ఓ యువకుడు ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దారుస్సలాం ఓల్డ్ జులా వద్ద నివాసం ఉండే బాలరాజు కుమారుడు ఎస్.సురేష్(27) మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు హెచ్చరించడంతో మనస్థాపానికి గురై ఈ నెల 16న ఇంట్లో ఉన్న ఫినాయిల్ తాగాడు. అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మంగళవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తదితరులు

యాకుత్‌పురా: అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. తలాబ్‌చంచలం డివిజన్ పరిధిలోని అమన్‌నగర్-బీ ప్రాంతంలో కొనసాగుతున్న బాక్స్ డ్రైనేజీ, ఎస్‌పీ పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన కార్పొరేటర్ సమీనా బేగం, పలు విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్‌లోని అమన్‌నగర్-బీ బస్తీలో రూ.20 లక్షల నిధులతో నాలా పై కప్పు, బాక్స్ డ్రైనేజీ, సీసీ రోడ్డు, ఎస్‌పీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కొన్ని రోజులుగా పనుల్లో వేగం తగ్గిందన్నారు. కమిషనర్, జోనల్ కమిషనర్‌లతో చర్చించి పనులను వేగంగా పూర్తి చేయాలని చెప్పడంతో వర్షాల కారణంగా నిలిచిన పనులను సకాలంలో చేపడుతామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

సంతోష్‌నగర్‌లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీ



సంతోష్‌నగర్: మద్యం తాగి వాహనాలు నడిపి తమ ప్రాణాలతో ఇతరుల ప్రాణాలకు హాని కలిగించొద్దని సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్ అన్నారు. సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐ.ఎస్.సదన్ జంక్షన్, చంపాపేట్ జంక్షన్ల వద్ద మంగళవారం ఆయన సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్, ఎస్సై, సిబ్బందితో కలిసి డ్రంకన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాల నివారణకు స్టేషన్ పరిధిలో ప్రత్యేకంగా ఆకస్మికంగా డ్రంకన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని, డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులపై కేసులు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఆలంల ఊరేగింపు


టోలిచౌకీలో అలంల ఊరేగింపు

గోల్కొండ: మొహర్రం సంతాప దినాలు కొనసాగుతున్నాయి. టోలిచౌకీ చౌరస్తా, అహ్మద్‌నగర్, సోమాజినగర్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో ప్రతినిత్యం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఆలంలను ఊరేగిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఆలంలను స్థానిక ముస్లింలు దర్శించుకొని దట్టీలు సమర్పించుకుంటున్నారు. హుమాయూన్‌నగర్, రేతిబౌలి, రింగ్‌రోడ్డు, ఆసిఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పవిత్ర కర్బల యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన వారి స్మృతిలో షర్బత్, తాగునీటిని పంపిణీ చేస్తున్నారు.

సన్మానం

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి బోనాల ఉత్సవాలు శాంతియుతంగా ముగిశాయని ప్రముఖ సంఘసేవకుడు ఎస్.రాజువస్తాద్ అన్నారు. బోనాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి రిసాలబజార్‌లో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా రాజువస్తాద్ మాట్లాడుతూ..బోనాల సమయంలో అమ్మవార్లకు సేవ చేసే వృత్తిపని వారు వంశపార్యపర్యంగా తమ వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బి.సాయిబాబాచారి, మహంకాళి ఆలయ పూజారి సురేష్‌చారి తదితరులున్నారు.


రాజువస్తాద్‌తో సాయిబాబాచారి తదితరులు

ఆగస్టు 15న డయాలసిస్ ప్రీమియర్ లీగ్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: డయాలసిస్ రోగుల కోసం క్రీడా పోటీలు నిర్వహించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సాఫ్ మెడికల్ సెంటర్ వారు ఆగస్టు 15న నిర్వహిస్తున్న డీపీఎల్ క్రీడా పోటీల వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాఫ్ మెడికల్ డైరెక్టర్ ఇటువంటి మహోన్నత కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. సాఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ..దేశంలోనే మొదటిసారిగా డయాలసిస్ తీసుకుంటున్న రోగుల కోసం ఈ లీగ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. సాఫ్ కిడ్నీ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షోయబ్ అహ్మద్ ఖాన్ తదితరులున్నారు.


శివబాగ్ ఆలయంలో..


పూజల్లో వీఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు


నాగదుర్గ ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అబిడ్స్ పరిశ్రమల శాఖ కార్యాలయంలో..

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

నాగుల పంచమి వేడుకలను చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి పుట్టలలో పాలుపోసి మొక్కులు చెల్లించుకోన్నారు. పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం


జియాగూడ ఇమాంపురాలో..


పూజల్లో గోషామహల్ కాంగ్రెస్ నాయకులు బజ్జుగోప్ యాదవ్


ఏడుగుళ్ల ఆలయం వద్ద..